సీజనల్ వ్యాధులతో జాగ్రత్త !

- కురుస్తున్న వర్షాలు.. ప్రబలుతున్న వైరల్ జ్వరాలు
- అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన



పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది



గుడిబండ: వానలు కురుస్తున్నాయి. వాతావరణంలో మార్పులు కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అపరిశుభ్రత, ఆహారంలో లోపాల కారణంగా రోగాలు వస్తాయి. ముందు జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వర్షపు నీరు నిలిచి ఉండటం, పరిసరాలు పరిశుభ్రత లేకపోవడం, తాగునీరు, గాలి కలుషితం, మురుగు కుంటల్లో దోమలు వృద్ధి చెందడంతో వైరల్ జ్వరాలు వస్తున్నాయి.

ఐదు డయేరియా కేసులు

గుడిబండ మండల వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రస్తుతం మూడు డయేరియా కేసులు నమోదయ్యాయి. వీరే కాకుండా ప్రైవేటు ఆస్పత్రులు, క్లీనిక్‌లలో రోగుల తాకిడి ఎక్కువగానే ఉంటోంది. ఈ సీజన్‌లో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామర్లు, చికన్ గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫీవర్ సర్వేలు కూడా చేస్తున్నారు. ప్రజలకు తమ ఇళ్ల చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పిస్తున్నారు. అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తూ అధికారులకు తెలియజేస్తూ పారిశుధ్య చర్యలు తీసుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్లి జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు రోగాల బారిన పడుతున్న వారి రక్త నమూనాలను సేకరిస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా...

- ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. అలాగే నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- కూలర్లు, టైర్లు, తాగిపారవేసిన కొబ్బరి బొండాలు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి.
- శరీరం మొత్తం కప్పేలా దుస్తులు ధరించాలి.
- చలి, జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

పరిశుభ్రత తప్పనిసరి



వర్షాకాలంలో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది. బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్, దోమలు వృద్ధి చెందడానికి ఇది అనుకూల కాలం. ఈ కాలంలో ఇమ్యూనిటీ కూడా కొంత బలహీనపడుతుంది. దీంతో అనారోగ్యాలు ఎక్కువగా దాడి చేస్తూ ఉంటాయి. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలంలో వచ్చే అనారోగ్యాలకు తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, విరేచనాలు, చర్మ సమస్యలు వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. వీటిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకం కావచ్చు. రెండు రోజులకు మించి జ్వరం తగ్గకుంటే స్థానిక హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సంప్రదించాలి.

- సౌందర్య, వైద్యాధికారిణి, గుడిబండ

- భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలి.
- శుభ్రమైన ఆహారం తీసుకోవాలి.
- వైద్యుల సూచనల మేరకు వైద్యం తీసుకోవాలి.
- పండ్ల రసం, కొబ్బరి నీళ్లు వంటివి తీసుకోవాలి.

క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రం తనిఖీ



రొద్దం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మంజువాణి

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న బీసీజీ వ్యాక్సినేషన్‌పై వివరాలను అడిగి తెలుసుకున్నారు. జూలై 1 నుంచి 30 వరకూ చేపట్టే యాంటీ డయేరియా కార్యక్రమంపై సిబ్బందికి సూచనలిచ్చారు.రక్తహీనత కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టి మహిళలందరికీ అవగాహన కల్పించాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాని సూచించారు. అనంతరం ఎంజేపీ, కేజీబీవీ పాఠశాలలో ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ విజయలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి కుళ్లాయప్పనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉషశ్రీచరణ్ పర్యటన

పరిగి:మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ గురువారం మండలంలో పర్యటిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా తొలుత ఉదయం 8.30 గంటలకు శ్రీరంగరాజుపల్లి పంచాయతీ పరిధిలోని ముల్లమొతుకపల్లిలో పర్యటన ప్రారంభిస్తారన్నారు. అనంతరం పరిగి, హొన్నంపల్లి పంచాయతీ జంగాలపల్లి, శీగిపల్లి పంచాయతీ గణపతిపల్లిలో పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమవుతారని చెప్పారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉషశ్రీచరణ్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్దాం



కంపాక్ట్ వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: ప్రజల ఆశీస్సులతో గెలిచామని, కక్ష సాధింపు చర్యలు వద్దని, పెనుకొండ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుదామని మంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆమెరూ. 50 లక్షల విలువజేసే కంపాక్ట్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెనుకొండ రూపురేఖలు మార్చడమే తన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నగర పంచాయితీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ల అరెస్ట్

తుమకూరు: మధుగిరి ఉపవిభాగం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఏపీలోని హిందూపురానికి చెందిన జీఆర్ జిన్నా (34), రిజ్వాన్‌బాషా అనే నిందితులను మిడిగేశీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ. 29.35 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 82 వేల విలువైన సెల్‌ఫోన్లు, రూ. 3.80 లక్షల విలువైన మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చోరీ సొత్తును హిందూపురంలోని భరత్ అనే వ్యాపారికి విక్రయించినట్లు విచారణలో తేలిందని, దీంతో భరత్‌ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్న విద్యార్థులు

మడకశిర: పట్టణంలోని ఎమ్మార్సీలో బుధవారం దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అంబేడ్కర్ ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేశారు. సాహు మహారాజ్ 150వ జయంతి వేడుకల సందర్భంగా పురస్కారాలను సీఐ రాజ్‌కుమార్, స్థానిక ఎంఈఓ భాస్కర్ చేతుల మీదుగా అందించారు. ఐదు మండలాల్లోని 15 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో దళిత పరిరక్షణ సమితి అధ్యక్షుడు హనుమంతు, ముస్లిం నగారా యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్‌ఖాన్, జననీ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు జయప్రకాష్, మైనార్టీ నాయకుడు ఉబేదుల్లా తదితరులు పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

మడకశిరరూరల్: ఈ నెల 29న మడకశిర కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలని సూచించారు.

పరిమళించిన మానవత్వం



మతిస్థిమితం లేని వృద్ధుడికి జుట్టు తీయిస్తున్న దృశ్యం



సపర్యల అనంతరం వృద్ధుడు ఇలా..

సోమందేపల్లి: మతిస్థిమితం లేని వ్యక్తిని సత్యసాయి సేవాసమితి సభ్యులు చేరదీసి సపర్యలు చేసి మానవత్వం చాటుకున్నారు. కొంతకాలంగా మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద మతిస్థిమితం లేని తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఓ వృద్ధుడు సంచరిస్తున్నాడు. చిరిగిన బట్టలు పెరిగిన జుట్టుతో తిరుగుతున్న అతన్ని బుధవారం సత్యసాయి సేవా సమితి సభ్యులు చేరదీశారు. ఇందులో భాగంగానే జుట్టు కత్తిరించి, స్నానం చేయించి కొత్త బట్టలు తొడిగించారు. అనంతరం అతనికి కడుపు నిండా భోజనం పెట్టించారు. వారి సేవాగుణాన్ని గ్రామస్తులు ప్రశంసించారు.

వసతి గృహం తనిఖీ



వసతులపై విద్యార్థులతో ఆరా తీస్తున్న తహసీల్దార్

లేపాక్షి: స్థానిక వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న వెనుకబడిన బాలుర సంక్షేమ వసతి గృహాన్ని బుధవారం సాయంత్రం తహసీల్దార్ బాలనరసింహులు, ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలు, మెనూ, విద్యార్థుల హాజరు, అభ్యసనాలను వారు పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పిల్లలను బడిలో చేర్పించండి

రొళ్ల: తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్పించి ఉన్నత చదువులు చదివించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రత్నగిరి, గొల్లహట్టిలోని ప్రాథమిక పాఠశాలతో పాటు అంగనవాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఆయా కేంద్రాల్లో రికార్డులు పరిశీలించి పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు



విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించిన దృశ్యం

హిందూపురం: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుధవారం పాంచజన్య పాఠశాలలో ఆ పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు చేతుల మీదుగా నగదు పురస్కారాలు అందజేశారు. ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన వారికి ప్రతి ఏడాది రూ.10 వేలతో పాటు సన్మానించడం హర్షణీయమన్నారు.

పురోగాభివృద్ధికి తోడ్పాటు అందించండి



వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ ప్రేమ్‌కుమార్

హిందూపురం టౌన్: చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే లోపాలు గుర్తించి వారి జీవితాల్లో పురోగాభివృద్ధికి తోడ్పాటు అందించాలని వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులకు డీఈఐసీ చిన్నపిల్లల వైద్యుడు ప్రేమ్‌కుమార్ సూచించారు. బుధవారం హిందూపురంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గల డీఈఐసీ (జిల్లా త్వరిత చికిత్స కేంద్రం)లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా 0–5 సంవత్సరాలలోపు చిన్నారులలో కలిగే పలు లోపాల గుర్తింపునకు వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులకు ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు.

కారు బోల్తా



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆల్టో కారు

రొళ్ల: ఓ ఆల్టో కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటన జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఆవినకుంటకు చెందిన ప్రభాకర్ పని నిమిత్తం మడకశిర వైపు కారులో వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గ మధ్యలోని రొళ్లకొండ గ్రామ సమీపాన అటవీశాఖ నర్సరీ వద్దకు రాగానే కారు రోడ్డుపై అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రభాకర్‌కు బలమైన గాయాలవగా హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వేరుశనగ పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

గోరంట్ల: మండలంలో పలు గ్రామల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను బుధవారం పుట్టపర్తి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ జాన్సన్, రాయసుబ్బయ్య, వ్యవసాయ అధికారులతో కలసి పరిశీలించారు. వేరుశనగ పంట ప్రస్తుతం విత్తే దశ నుంచి ఉడ దశకు చేరుకుంది. వేరుశనగ పంటకు పచ్చపురుగు సోకినట్లు గుర్తించిన శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. మొక్కజొన్న పంటను పరిశీలించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఎంజేపీ ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్ శ్యామ్‌భూపాల్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు క్రాస్‌లో నిర్మించిన మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌భూపాల్‌రెడ్డి పదవీ విరమణ పొందారు. పాఠశాలలో బుధవారం ఆయనకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ జయసింహనాయుడు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ రమణారెడ్డి కూడా పదవీ విరమణ చేయగా ఆయనను పాఠశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమశేఖర్ పాల్గొన్నారు.

వార్డు మెంబర్ రాజీనామా



ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న గోవిందరాజు

అగళి: మండల పరిధిలోని కోడిపల్లి పంచాయతీ చెందిన గోవిందరాజు 11 వార్డ్ మెంబర్ (టీడీపీ మద్దతుదారుడు) వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు తన రాజీనామా లేఖను అందజేశారు.

ఆడపిల్లలను రక్షించుకోవాలి

పావగడ: భ్రూణ హత్యలు, బాల్య వివాహాల నుంచి ఆడ పిల్లలను కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీడీపీఓ సునీత తెలిపారు. తాలూకాలోని దొడ్డహళ్లి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపల్ షాపుల వేలం

హిందూపురం: మున్సిపాల్టీ పరిధిలోని మున్సిపల్ షాపుల వేలం పాటను బుధవారం నిర్వహించారు. ఇందులో 13 షాపులు వేలం పాటలు పూర్తిచేసి మిగిలిన 8 షాపుల వేలం పాట వాయిదా వేసినట్లు కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరా పార్కులోని షాపింగ్ కాంప్లెక్స్ నంబర్ 17, లైబ్రరీ షాపింగ్ కాంప్లెక్స్ నంబర్ 13, పాతబస్టాండ్‌లోని రూం నంబర్లు 8, 19 ,23 లను హెచ్చుపాటదారులకు కేటాయించామన్నారు. మిగిలిన 9 షాపింగ్ గదుల వేలంపాట వాయిదా వేశామని, తిరిగి తేదీలను నిర్ణయిస్తామన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

పావగడ: స్థానిక సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. తాలూకా లోని బ్యాడనూరు ఎంజీఎం ఉన్నత పాఠశాలకు చెందిన 90 మంది విద్యార్థులు, గుండార్లహళ్లి 150 మంది విద్యార్థులు, పెమ్మనహళ్లి 60 మంది విద్యార్థులు, హొసహళ్లి 60, మంగళవాడకు చెందిన 160 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. సత్యసాయి సేవాసమితి పదాధికారులు రామప్రసాద్, రమేశ్, మహంతేశ్,, బ్యాడనూరు శివు తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పక పాటించాలి

అమరాపురం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న బోజన ఏజెన్సీ నిర్వాహకులు మెనూ ప్రకారం వంట వండి విద్యార్థులకు వడ్డించాలని తహసీల్దార్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఉప్పార్లపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంఈఓ–2 వెంకటరమణనాయక్ ఉన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు



అలంకరణలో ఆంజనేయస్వామి

మడకశిరరూరల్: మండల పరిధిలోని సింగేపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయాన్ని గ్రామస్తులు మరమ్మతు చేయించి సరికొత్తగా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగానే బుధవారం ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు చేయించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. శనివారం స్వామి వారికి జ్యోతుల ఉత్సవాలను నిర్వహిస్తునట్లు గ్రామ ప్రజలు తెలిపారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

- ఎలాంటి పరిస్థితుల్లోనూ మత్తు జోలికి వెళ్లొద్దు
- జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ



హిందూపురం: సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కంపల్లె శైలజ

హిందూపురం అర్బన్: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సప్తగిరి కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సదస్సు నిర్వహించారు. శైలజ మాట్లాడుతూ యువత తలచుకుంటే ఏదైనా సాధించవచ్చన్నారు. మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని హితవు పలికారు. భారత దేశంలో ఉన్నంత యువ సంపద మరే దేశంలోనూ లేదన్నారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ లక్ష్యాలను సాధించి సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు నేర్చుకోవాలన్నారు. ఆకర్షణలకు లోను కాకుండా వాస్తవ జీవితాలను గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, న్యాయవాదులు సుదర్శన్, సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మాదక ద్రవ్యాల వినియోగంతో ప్రాణాలు పోవడంతో పాటు కుటుంబాలు నాశనమవుతాయని ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. స్థానిక పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానంగా మాదక ద్రవ్యాల వాడకంతో ప్రస్తుత సమాజంలో కలుగుతున్న పెను ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా విద్యార్థి దశలోనే ఇలాంటి దుష్పరిణామాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ నేవీ ఆఫీసర్ నాగమోహన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పావగడ: ప్రాణాంతకమైన మాదక ద్రవ్యాలకు యువకులు దూరంగా ఉండాలని, లేకపోతే నిండు నూరేళ్ల జీవితం అర్థాంతరంగా ఆగిపోతుందని సీఐ సురేశ్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇప్పటికే దేశంలో 7.5 కోట్ల మంది డ్రగ్స్‌కు బానిసలుగా మారారని తెలిపారు. రోజూ 10 మంది కంటే పైగా వ్యసనపరులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాలూకాలోని దొమ్మతమరి తదితర ఆంధ్ర సరిహద్దు గ్రామాల్లో డ్రగ్స్ అక్రమ రవాణాపై సమాచారం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గురునాథ్, అధ్యాపకులు లింగరాజు, ప్రసన్నకుమార్, వెంకటరమణప్ప మాట్లాడారు.

పెనుకొండ: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యువత తెలిసో, తెలియకో డ్రగ్స్ బారిన పడి జీవితాలను అర్థాంతరంగా కోల్పోతున్నారని అలాంటి వారిలో వీటి పర్యవసానాలను వివరించి అవగాహన తీసుకురావాలన్నారు. సామాజిక భాధ్యతగా విద్యార్థులు ఈ చర్యలు చేపట్టాలన్నారు. పలువురు విద్యార్థులు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఐక్యూ కోఆర్డినేటర్ యశోదారాణి, ఎన్‌సీసీ అధికారి హరిప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారులు కాంతారావు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.



పరిగి: ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు



పావగడలో మాట్లాడుతున్న సీఐ సురేశ్



పెనుకొండ: సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

నేడు చేపల చెరువు వేలం

అమరాపురం: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు అమరాపురంలోని చేపల చెరువు, దినసరి సంత వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ భాస్కర్ తెలిపారు. చేపల చెరువు వేలం పాటలో పాల్గొనేవారు రూ.20 వేలు, దినసరి సంతకు రూ.10 వేలు డిపాజిట్ చేయాలన్నారు. ఈ అవకాశాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముద్దాయికి రిమాండ్

పెనుకొండ: మండలంలోని కొండంపల్లికి చెందిన అక్రమ మద్యం విక్రేత ఎరుకల గంగయ్యకు న్యాయమూర్తి బుధవారం 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ.రాజేష్ తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు... 2020 డిసెంబర్ 31న గంగయ్య కర్ణాటక నుంచి మద్యం తీసుకొస్తుండగా అప్పటి ఎస్ఐ. వెంకటేశ్వర్లు పట్టుకుని అతని నుంచి 48 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయితే అప్పటి నుంచి పరారీలో ఉన్న గంగయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు చెప్పారు.